సాక్షి
హనుమకొండ
శుక్రవారం | 19 | జూలై | 2024



అనారోగ్య ఆహారం..

ఫాస్ట్ ఫుడ్.. ప్రస్తుత సమాజంలో ఫ్యాషన్‌గా మారింది. పేద, మధ్య, ధనికులు అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ ప్రాధాన్యం ఇస్తున్నారు.

- 8లో



టీజీడీఎస్సీ షురూ..

టీజీడీఎస్సీ గురువారం నుంచి ప్రారంభమైంది. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్(సీబీటీ) టెస్ట్ నిర్వహిస్తున్నారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
27^0/23^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న శాకంబరీ ఉత్సవాలు





హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో శాకంబరీ నవరాత్రోత్సవాలు గురువారం పదమూడో రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని బలకా, విజయా క్రమంలో పూజించారు. ఉదయం నుంచి ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిథి మండల దేవతాయజనంలో భాగంగా అమ్మవారి స్నపనమూర్తిని కాళీక్రమమైన బలకా అమ్మవారిగా, అమ్మవారి భోగబేరాన్ని షోఢశీ క్రమంలో విజయా అమ్మవారిగా అలంకరించి పూజలు నిర్వహించారు. మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతారావు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎట్టకేలకు ఎస్సై రిలీవ్

సాక్షి ఎఫెక్ట్

హసన్‌పర్తి: 'బదిలీ అయినా అక్కడే తిష్ట' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పోలీసు అధికారులు స్పందించారు. బదిలీ అయినా రిలీవ్ కాని హసన్‌పర్తి ఎస్సై అశోక్‌పై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. బదిలీ అయినప్పటికీ ఎందుకు రిలీవ్ చేయలేదని స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అశోక్‌ను గురువారం రిలీవ్ చేశారు. కాగా.. బదిలీ అయినప్పటికీ ఇక్కడే ఎందుకు తిష్టవేశారని? ఏడాదికాలంగా అశోక్ బాధ్యతలు నిర్వహిస్తున్న క్లస్టర్‌లో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్ని కేసులు నమోదయ్యాయి? ఎన్ని కేసుల్లో రాజీ కుదిరింది? అనే విషయమై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. భూ వివాదంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న అన్నాసాగరం గ్రామానికి చెందిన బండా మహేందర్‌రెడ్డి ఏరియా కూడా ఎస్సై అశోక్ పరిధిలోకే వస్తోంది. ఈవిషయమై కూడా ఉన్నతాధికారులు తీగలాగుతున్నట్లు తెలిసింది.

హాస్టళ్లు ఖాళీ చేయాలని సర్క్యులర్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పీజీ కోర్సుల ఫైనలియర్ విద్యార్థులకు గురువారంతో పరీక్షలు ముగిశాయి. అన్ని పీజీ కోర్సుల ఫైనలియర్ విద్యార్థులకు నాలుగో సెమిస్టర్ పరీక్షలు ముగిసినందున యూనివర్సిటీ క్యాంపస్‌లోని హాస్టళ్లలో వసతి పొందుతున్న ఆయా ఫైనల్ ఇయర్ విద్యార్థులు తమ గదులను ఖాళీ చేయాలని గురువారం కేయూ హాస్టళ్ల డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ సర్క్యులర్ జారీ చేశారు. వివిధ హాస్టళ్ల వద్ద, మెస్‌ల వద్ద కూడా ఆసర్క్యులర్‌ను నోటీస్ బోర్డులో అతికించారు. ఈనెల 28 వరకు గదులను ఆయా విద్యార్థులు ఖాళీ చేయాలన్నారు. ఖాళీ చేసిన గదుల తాళాలను సంబంధిత హాస్టల్స్ కేర్‌టేకర్లకు అప్పగించాలన్నారు. ఆసర్క్యులర్‌లో పేర్కొన్నట్లుగా వెకేట్ చేయకపోతే ఆయా విద్యార్థుల గదులకు తాళాలు వేయిస్తామన్నారు. ఆతర్వాతి పరిణామాలకు సిబ్బంది బాధ్యత వహించరని ఆయన తెలిపారు. అదేవిధంగా మెస్ కార్డులను క్యాన్సిల్ చేసుకోవాలని రాజ్‌కుమార్ కోరారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

వరంగల్: రాష్ట్రంలోని దివ్యాంగుల సంక్షేమానికి ప్రజాప్రభుత్వం కృషి చేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. వరంగల్ ఏనుమాముల మార్కెట్ యార్డు ఆవరణలో జిల్లా సంక్షేమ శాఖ, అలింకో సంయుక్త ఆధ్వర్యంలో గురు వారం దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లు, ల్యాప్ టాప్‌లను కలెక్టర్ సత్య శారదాదేవితో కలిసి ఎమ్మెల్యే నాగరాజు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాలకు చెందిన 102 మంది దివ్యాంగులకు రూ.42 లక్షల విలువైన 102 బ్యాట రీ ట్రైసైకిళ్లు, రూ.2.70 లక్షల విలువైన 6 ల్యాప్‌టా ప్‌లు, ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించిన దివ్యాంగురాలికి పుల్లీ ఆటోమేటెడ్ త్రిచక్ర వాహనం పంపిణీ చేశామన్నారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి మాట్లాడుతూ ప్రతిభకు వైకల్యం అడ్డురాదని అన్నారు. దివ్యాంగులు వికలాంగత్వాన్ని జయించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని, పట్టుదలతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తూర్పాటి సులోచన, అదనపు కలెక్టర్ సంధ్యారాణి,డీడబ్ల్యూఓ హైమావతి, డీఎంఓ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

1,31,043 కుటుంబాలు.. రూ.753.38 కోట్లు

ఉమ్మడి వరంగల్ రైతులకు మొదటి విడత 'మాఫీ'

- రైతువేదికల్లో రైతులు, అధికారులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్..
- హాజరైన ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అధికారులు
- అంబరాన్నంటిన సంబురాలు.. సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకాలు



రైతువేదికలో మాట్లాడుతున్న జంగా రాఘవరెడ్డి, చిత్రంలో కలెక్టర్ ప్రావీణ్య

సాక్షిప్రతినిధి, వరంగల్/మడికొండ: రైతు రుణమాఫీ సంబురాలు ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా అంబరాన్నంటాయి. మొదటి విడతగా రూ.లక్ష వరకున్న రుణాలను గురువారం మాఫీ చేసింది. ఉమ్మడి వరంగల్ ఆరు జిల్లాలో 1,37,897 ఖాతాలు, 1,31,043 కుటుంబాలకు చెందిన రూ.753.38 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఇదో చరిత్రాత్మక నిర్ణయంగా అభివర్ణించారు. కాగా, సీఎం రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధులు, ఆయా జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. రూ.2 లక్షల రుణమాఫీ చరిత్రాత్మక ఘట్టమని, తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం దేశానికే ఆదర్శమని చెప్పుకొచ్చారు. ఖిలావరంగల్ మండలం బొల్లికుంట రైతు వేదికలో ఏర్పాటుచేసిన వీడి యో కాన్ఫరెన్స్‌లో రైతు ఎల్లయ్యతో సీఎం ముఖా ముఖి మాట్లాడారు. ఈ క్రమంలో రైతు ఎల్లయ్య వరంగల్‌లో రైతు కృజ్ఞతసభ నిర్వహించాని కోరగా, సీఎం స్పందించారు. రైతు డిక్లరేషన్ సభను నిర్వహించిన వరంగల్‌లోనే ఎల్లయ్య సూచనల మేరకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి కత్జ్ఞతలు తెలిపేలా సభను నిర్వహించబోతున్నట్లు వెల్లడించారు. సున్నా నుంచి రూ.లక్ష వరకు ఉన్న రైతులకు రుణమాఫీని మొదటి దశలో చేశామని, రెండు, మూడు దఫాల్లో రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామన్నారు.

జిల్లా	రుణమాఫీ ఖాతాలు	కుటుంబాల సంఖ్య	మాఫీ అయిన మొత్తం (రూ.కోట్లలో)
హనుమకొండ	26,369	25,161	145.00
వరంగల్	26,396	24,626	134.21
జేఎస్‌భూపాలపల్లి	17,054	16,266	94.86
ములుగు	12,997	12,350	69.97
మహబూబాబాద్	28,585	27,249	159.65
జనగామ	26,496	25,391	149.69

మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ : జంగా

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన రైతు రుణమాఫీ మాట నిలబెట్టుకుందని రాష్ట్ర ఆయిల్ పామ్, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. గురువారం కాజీపేట మండలం మడికొండలోని రైతు వేదికలో రైతు రుణమాఫీ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జంగా రాఘవరెడ్డి పాల్గొన్నారు. ముందుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఏకకాలంలో రూ.లక్ష రుణమాఫీ చేశారని, 2024లో రూ.2 లక్షల రుణమాఫీ రేవంత్‌రెడ్డి చేస్తున్నారన్నారు. హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. రుణమాఫీ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ దామోదర్‌రెడ్డి, తహసీల్దార్ బావుసింగ్, ఏఓ శ్రీధర్ రెడ్డి, ఏఈఓ భరత్, జయప్రకాశ్, రజిత, నాయకులు తొట్ల రాజుయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, బైరి లింగమూర్తి, కుర్ల మోహన్, పైడిపాల రఘుచందర్, వస్కుల శంకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు రాజీనామా చెయ్

- లేకుంటే ముక్కు నేలకు రాయ్..
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ఎడ్లబండి నడుపుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు: రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని సవాల్ చేసిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగస్టు 15న రాజీనామా చేయాలని.. లేకపోతే గాంధీ విగ్రహం ఎదుట ముక్కు నేలకు రాయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఏక కాలంలో లక్ష రుణమాఫీ చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ.. గురువారం మండలంలోని హౌజుబుజుర్గు నుంచి ఎమ్మెల్యే స్వయంగా బైక్ నడుపుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో బైక్ ర్యాలీగా కలియదిరిగి మండల కేంద్రానికి చేరుకున్నారు. మండల కేంద్రంలో ఎడ్లబండి నడిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామన్నారు. 10 రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూలగొట్టిన ఘనత బీజేపీదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇంకా 20 ఏళ్లు ఉంటుందన్నారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, కక్కెర్ల రాజు, పరికిరాల వాసు, పర్వతగిరి రాజు, మార్క రజనీకర్, రేవూరి జయపాల్‌రెడ్డి, బోరిగం స్వామి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డ వాళ్లకు పెద్దపీట..

పార్టీలో కష్టపడ్డ వాళ్లకు పెద్దపీట వేస్తానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బైక్ ర్యాలీ ప్రారంభంలో ఉన్న కార్యకర్తలు చివరి వరకు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమం మధ్యలో వదిలేసిన వారి వివరాలివ్వాలని మండల అధ్యక్షుడు రమేశ్‌ను ఆదేశించారు. నాయకులు ఎవరైనా ఫోజులు కొడితే సహించేది లేదని హెచ్చరించారు.

విద్యార్థులతో మమేకమైన కలెక్టర్



వడ్డేపల్లి మిడిదొడ్డివాడ అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రీ స్కూల్ కిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ: పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులతో హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య మమేకమయ్యారు. అంగన్‌వాడీ చిన్నారులతో సందడిగా గడిపారు. గురువారం హనుమకొండ వడ్డేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. 'మన ఊరు.. మన బడి' కార్యక్రమం కింద పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనుల్ని కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల గదుల్లో చేపట్టిన విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణ పనుల్ని పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీర్లను ఆదేశించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. స్కూల్ డ్రెస్, పాఠ్యపుస్తకాలు అందరికీ అందాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎలా చదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. పుస్తకంలోని పాఠ్యాంశాలు చదివించారు. అనంతరం ఇదే ఆవరణలో ఉన్న ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. తరగతి గదిలో చీకటి ఉండడంతో పాటు విద్యుత్ బల్బులు వెలుగకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మిడిదొడ్డి వాడ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ కిట్స్‌ను పరిశీలించారు. విద్యా బోధన చేస్తున్న తీరును తెలుసుకుని అభినందించారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంత రం ఆవరణలో వనమహోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కనాటి నీళ్లు పోశారు. ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. అంగన్‌వాడీలో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరు చేస్తానని కలెక్టర్ తెలిపారు. కా ర్యక్రమంలో జిల్లావిద్యాశాఖాధికారి వాసంతి, జిల్లా సంక్షేమాధికారి మధురిమ, ఏఈ శ్రీకాంత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, అంగన్‌వాడీ టీచర్ మంజుల పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీస్

విద్యారణ్యపురి: వడ్డేపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఉర్దూ మీడియం)లోని ఉపాధ్యాయురాలు ఆసియా సిద్దికీకి హనుమకొండ డీఈఓ వాసంతి గురువారం సాయంత్రం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. గురువారం హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య ఆ పాఠశాలను తనిఖీ చేశారు. ఆ ఉపాధ్యాయురాలు ఆసియా సిద్దికీ విద్యార్థులకు బోధనాభ్యసన ప్రక్రియ వర్క్‌బుక్‌లను ఉపయోగించకపోవడాన్ని కలెక్టర్ గుర్తించారు. పాఠశాలలోని మౌలిక వసతులపై ఉపాధ్యాయురాలికి అవగాహన లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. వర్క్‌బుక్స్ ఉన్నప్పటికీ విద్యార్థులకు బోధనాభ్యసన ప్రక్రియలు చేయించకపోవడాన్ని బట్టి ఉపాధ్యాయురాలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు డీఈఓ వాసంతి తెలిపారు. రెండ్రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

స్థానిక సంస్థల్లో బీజేపీదే విజయం

- ఇకపై అన్ని ఎన్నికలు ముఖ్యమే
- పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంఘటన) చంద్రశేఖర్



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

హన్మకొండ: స్థానిక సంస్థల్లో బీజేపీదే విజయమని, అవినీతి, అరాచక పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు రాష్ట్రంలో స్థానం లేదని బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. గురువారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో బీజేపీ హనుమకొండ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ముందుగా సమావేశం హాల్ ఆవరణలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసమావేశానికి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. ఇక నుంచి పార్టీకి అన్ని ఎన్నికలు ముఖ్యమేనని, కేవలం ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలే కాదు.. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ విజయమే లక్ష్యంగా పని చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 7 నెలలు దాటినా.. ఇచ్చిన హామీలను అమలు చేయక ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని విమర్శించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, నాయకులు డాక్టర్ విజయ రామారావు, మార్తినేని ధర్మారావు, అరూరి రమేశ్, ఒంటేరు జయపాల్ పాల్గొన్నారు.

ఎంజీఎం సూపరింటెండెంట్ బదిలీ

- కేఎంసీ ప్రిన్సిపాల్ కూడా..
- నగరాన్ని వదిలి వెళ్తున్న 36 మంది ప్రొఫెసర్లు.

ఎంజీఎం: కొన్నేళ్లుగా ఎంజీఎం, కేఎంసీలో విధులు నిర్వర్తిన్న వైద్యాధికారులు, ప్రొఫెసర్లు ప్రభుత్వ నిర్ణయంతో బదిలీపై వెళ్తున్నారు. కేఎంసీ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్న డాక్టర్ మోహన్‌దాస్ నర్సంపేట కళాశాలకు ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ములుగు వైద్య కళాశాలకు ప్రొఫెసర్‌గా బదిలీ అయ్యారు. వీరి స్థానాల్లో ప్రభుత్వం ఇంకా ఎవరినీ నియమించలేదు. అదేవిధంగా.. ఎంజీఎం, కేఎంసీలోని పలు విభాగాల్లో పని చేస్తున్న 36 మంది ప్రొఫెసర్లు బదిలీ అయ్యారు. వీరు ఈ స్థానాల్లో సుదీర్ఘ కాలంగా పనిచేస్తుండడంతో వీరంతా ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ వైద్య కళాశాలలకు బదిలీ అయ్యారు. కేఎంసీలో పని చేస్తున్న ఏడీ యాదగిరి భూపాలపల్లి వైద్య కళాశాలకు, ఎంజీఎం ఆస్పత్రిలో ఏడీగా విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మీరాజం కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. అలాగే సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నోడల్ అధికారిగా పనిచేస్తున్న గోపాల్‌రావును జనగామ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. వివిధ విభాగాలకు చెందిన బదిలీలు ఈనెల 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

విద్యాశాఖలో 28 మంది బదిలీ

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లా విద్యా శాఖ పరిధిలో ప్రభుత్వ హైస్కూల్స్, డీఈఓ కార్యాలయం, ప్రభుత్వ బీఈడీ, ప్రభుత్వ డైట్ కళాశాలల్లోని ఆఫీస్ సబార్డినేట్, రికార్డు అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్ల కేడర్‌లో బదిలీలకు ఇటీవలనే కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ ప్రక్రియ జరిగింది. ఒకే చోట ఐదేళ్లుగా పని చేస్తున్న ఆయా ఉద్యోగులు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. దీంతో నాన్‌టీచింగ్ ఉద్యోగులు బదిలీలకు ఇటీవల దరఖాస్తులు చేసుకున్నారు. అందులో 28 మంది ఆయా కేటగిరీల ఉద్యోగులు బదిలీ అయినట్లు సమాచారం. ఆయా ప్రభుత్వ హైస్కూళ్లతో పాటు డీఈఓ కార్యాలయం, బీఈడీ, డైట్ కళాశాలల్లోనే ఒక చోట నుంచి మరో చోటికి బదిలీ అయ్యారు. వీరికి కలెక్టర్ అప్రూవల్‌తో ఒకటి రెండు రోజుల్లో బదిలీ ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

పారదర్శకంగా బదిలీల కౌన్సెలింగ్

- గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



ఉద్యోగులకు కౌన్సెలింగ్ ఇస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: పారదర్శకంగా బల్దియా ఉద్యోగులు సిబ్బందికి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు బదిలీల కమిటీ కన్వీనర్, గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో బల్దియా జూనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్లు, నాల్గవ తరగతి ఉద్యోగులకు బదిలీలపై కౌన్సిల్ ప్రక్రియ నిర్వహించారు. కమిషనర్, హనుమకొండ అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధిక గుప్తా, డీఆర్ఓ గణేశ్‌తో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో బల్దియా ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ కృష్ణారెడ్డి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, డిప్యూటీ తహసీల్దార్లు సంతోశ్‌కుమార్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఏఈలకు షోకాజ్ నోటీసులు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో మూడు మండలాల్లోని ముగ్గురు ఏఈలకు కలెక్టర్ ప్రావీణ్య గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మౌలిక సదుపాయాల కల్పనకు వివిధ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. హసన్‌పర్తి, శాయంపేట, భీమదేవరపల్లి మండలంలోని వివిధ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పూర్తయిన పనులకు సంబంధించి ఎంబీ రికార్డులు చేయడంలో ఆయా మండలాల ఏఈలు జాప్యం చేస్తూ ఎంబీ రికార్డుల బిల్లులు సమర్పించడంలో అలసత్వం వహిస్తున్నారని గుర్తించి ఆమూడు మండలాలకు సంబంధించిన ముగ్గురు ఏఈలకు కలెక్టర్ షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు తెలిసింది. అదేవిధంగా ట్రైబల్ వెల్ఫేర్ శాఖకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)కి కూడా కలెక్టర్ షోకాజ్ నోటీస్ ఇచ్చారు. కాగా.. ఈ విషయాన్ని హనుమకొండ డీఈఓ వాసంతి ధ్రువీకరించారు.

'ఇన్‌చార్జ్' పాలన ఇంకెన్నాళ్లు?

నిట్ రిజిస్ట్రార్ కోసం మూడుసార్లు నోటిఫికేషన్

- ఆసక్తి చూపని సీనియర్ ప్రొఫెసర్లు
- పూర్తిస్థాయిలో అందని సేవలు



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ క్యాంపస్‌లో ఏడాదిగా ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ పాలనే కొనసాగుతోంది. దీంతో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లేక పరిపాలన కుంటుపడిపోయింది. 2023 మే నెలలో రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు ఉద్యోగ విరమణ పొందినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ పాలనే కొనసాగుతోంది. మే నెలలో గోవర్ధన్‌రావు విరమణ పొందిన తరుణంలో వైఎస్‌రెడ్డి ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ బాధ్యతల్ని స్వీకరించగా.. కొంత కాలానికే తాను కూడా ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం సీఎస్ఆర్‌కే ప్రసాద్ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టి వ్యక్తిగత కారణాలతో వైదొలిగారు. ప్రస్తుతం ప్రొఫెసర్ ఉమా మహేశ్వర్‌రావు ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా విధులు కొనసాగిస్తున్నారు.

నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ..

నిట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించి ఏడాది క్రితం ఉద్యోగ విరమణ పొందిన గోవర్ధన్‌రావు తర్వాత పూర్తి స్థాయిలో రిజిస్ట్రార్‌ను నియమించేందుకుగాను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ మే నెలలోనే నోటిఫికేషన్ జారీ చేశారు. తర్వాత నవంబర్‌లో ఒకసారి,ఇటీవల మరోసారి రిజిస్ట్రార్‌ను నియమించేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. మూడుసార్లు నోటిఫికేషన్ జారీ చేసినా..సీనియర్ ప్రొఫెసర్లు రిజిస్ట్రార్ బాధ్యతలు స్వీకరించేందుకు ఆసక్తి కనబర్చకపోవడం కళాశాలలో చర్చనీయాంశంగా మారింది.

పూర్తి స్థాయిలో అందని సేవలు

కళాశాలలో టీచింగ్, నాన్ టీచింగ్, ఔట్ సోర్సింగ్ వంటి ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయడంతో పాటు కళాశాలను పూర్తి స్థాయిలో పరిపాలించాల్సిన బాధ్యతను రిజిస్ట్రార్ తీసుకుంటారు. కాగా ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ నామమాత్రంగా విధులు నిర్వహిస్తున్నారని, తమకు పూర్తి స్థాయి సేవలు అందడం లేదని నిట్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆసక్తి చూపని సీనియర్ ప్రొఫెసర్లు

నిట్ రిజిస్ట్రార్‌గా పరిపాలనా బాధ్యతల్ని స్వీకరించేందుకు నిట్‌లోని సీనియర్ ప్రొఫెసర్లు ఎవరూ ఆసక్తి కనబర్చడం లేదు. రిజిస్ట్రార్‌గా ప్రత్యేక ప్యాకేజీ ప్రత్యేక క్యాబిన్‌తో హుందాగా పరిపాలన నిర్వహించాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఒక్కరు కూడా దరఖాస్తు చేసుకోలేదు. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపడితే టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది రిక్రూట్‌మెంట్, వేతనాలు, టీఏ,డీఏలతో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది రిక్రూట్‌మెంట్ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. కాగా.. గతంలో రిక్రూట్‌మెంట్‌లో చోటు చేసుకున్న అవకతవకలు, గత రిజిస్ట్రార్ కొన్ని రోజుల సస్పెన్షన్‌కు గురవడం వంటి సమస్యలతో.. అపవాదు మూట కట్టుకోవడం మనకెందుకు అంటూ ఎవరూ ముందుకు రావడం లేదనే చర్చ నడుస్తోంది.







ఆగకుండా జల్లులు..

వరంగల్ నగరంలో గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మోస్తరు వర్షం కురిసింది. ఆగకుండా జల్లులు పడుతూనే ఉన్నాయి. రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అత్యవసర పనుల కోసం గొడుగులు పట్టుకొని, రెయిన్‌కోట్లు వేసుకుని బయట తిరిగారు. హనుమకొండ బస్‌స్టేషన్ ఆవరణలో భారీగా వరద నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాల డ్రెయిన్లు నిండి రోడ్లపైకి వరద ప్రవహించింది. దీంతో పాదచారులు తీవ్ర అవస్థలు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, హన్మకొండ

చెక్కు అందజేత



వరంగల్ క్రైం : ఆకస్మికంగా మరణించిన కానిస్టే బుల్ కుటుంబానికి పోలీస్ భద్రత నుంచి మంజూరైన చెక్కును వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ గురువారం అందజేశారు. అర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రాజు గత మార్చి 13వ తేదీన అనారోగ్యంతో మరణించాడు. దీంతో తెలంగాణ పోలీస్ భద్రతా పథకం ద్వారా మంజూరు చేసిన రూ.7.89లక్షల చెక్కును కానిస్టేబుల్ సతీమణి మాధవికి సీపీ అందజేశారు. ఈ సందర్భంగా శాఖాపరంగా రావాల్సిన బెనిఫిట్స్ అందజేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. పరిపాలన విభాగం ఏఓ రామకృష్ణస్వామి, సెక్షన్ సూపరింటెండెంట్ జలజ, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తాం

ఐనవోలు: త్వరలోనే ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తామని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని ఐనవోలు, వెంకటాపూర్, సింగారం, మరియపురం, పున్నేలు, పంథిని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ముఖ్యమంత్రిని కలిసి పారిశుద్ధ్య కార్మికుల నియామకం, ఉచిత విద్యుత్, పెండింగ్ బిల్లుల మంజూరీ, పెండింగ్‌లో ఉన్న 5డీఏలలో 3డీఏలను, పీఆర్సీపై తగిన ఉత్తర్వులు ఇప్పిస్తామని భరోసా కల్పించారు. మందల తిరుపతిరెడ్డి, శ్రీహరి, సమ్మయ్య, తదితరులు ఉన్నారు.

సౌండ్ పొల్యూషన్‌తో ప్రజలకు ఇబ్బంది..

రామన్నపేట : సౌండ్ పొల్యూషన్‌తో ప్రజలకు ఇబ్బంది ఉంటుందని, ప్రజల ప్రశాంతతకు విఘాతం కలిగించొద్దని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ అన్నారు. ద్విచక్ర వాహన సౌండ్ పొల్యూషన్ సైలెన్సర్‌ను రోడ్ రోలర్‌తో తొక్కించారు. వరంగల్‌లోని ఎంజీఎం జంక్షన్‌లో ఉదయం 11.30 గంటలకు నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ సూచనలతో మూడు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లకు సంబంధించిన 150ద్విచక్ర వాహన సౌండ్ పొల్యూషన్ సైలెన్సర్‌ను గురువారం రోడ్డు రోలర్‌లతో తొక్కించారు. ఈ సందర్భంగా ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ.. సౌండ్ పొల్యూషన్ సైలెన్సర్‌లను వాహనాలకు అమర్చితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, కాజీపేట సీఐ నాగబాబు, హనుమకొండ సీఐ సుఖుర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం



వినయ్ (ఫైల్)

మామునూరు: లారీ బైక్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన బుధవారం అర్ధరాత్రి వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట క్రాస్ రోడ్డు సమీపాన సన్‌షైన్ బార్ ఎదురుగా జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జఫర్‌గఢ్ మండలం సూరారం గ్రామానికి చెందిన ముంజ రాజు కుమారుడు వినయ్(24) మిషన్ భగీరథ వాటర్ సప్లయ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం పని ఉందని చెప్పి బైక్ పై సూరారం నుంచి హనుమకొండకు బయల్దేరాడు. ఈక్రమంలో రాత్రి 11గంటల తర్వాత బొల్లికుంట క్రాస్ రోడ్డు సన్‌షైన్ బార్ వద్ద ఎదురుగా వచ్చే లారీ అదుపు తప్పి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో లారీ కిందపడి తలకు బలమైన గాయాలతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించి ఎంజీఎం మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. తండ్రి రా జు ఫిర్యాదు మే రకు గురువారం కేసు నమోదు చే సి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్య ఆహారం..

ఫాస్ట్‌ఫుడ్‌తో ఆరోగ్య సమస్యలు
- హెచ్చరిస్తున్న వైద్యనిపుణులు
- రంగులు కలిపిన ఆహారం విక్రయం
- పుట్టగొడుగుల్లా షాపులు..
- నాణ్యతాప్రమాణాలు గాలికి..

కాజీపేట : ఫాస్ట్ ఫుడ్.. ప్రస్తుత సమాజంలో ఫ్యాషన్‌గా మారింది. పేద, మధ్య, ధనికులు అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో తినుబండారాలు తయారు చేసుకోలేక ఫాస్ట్ ఫుడ్‌పై ఎక్కువ ఆధారపడుతున్నారు. పాశ్చాత్య ఆహారపు అలవాట్లను వంట బట్టించుకుంటున్నారు. అయితే వీటి వెనుక ఉన్న అనారోగ్య సమస్యలు గుర్తించలేకపోతున్నారు. రోగ నిరోధక శక్తి తగ్గడానికి, అధిక బరువు పెరగడానికి పెద్ద వయసువారిలో పొట్ట పెరగడానికి ఫాస్ట్‌ఫుడ్ ఇన్‌స్టెంట్ ఫుడ్ కారణమని వైద్యులు పేర్కొంటున్నారు.

నాణ్యతాప్రమాణాలు గాలికి

ఆకలి రుచి ఎరగదు..నిద్ర సుఖ మెరుగదంటారు. ఈ సామెతను అందిపుచ్చుకున్న కొందరు వ్యాపారులు జిల్లాలో అనేక ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో నూడుల్స్, పానీపూరి, బేకరీ ఐటమ్స్, నాన్‌వెజ్ ఫ్రైడ్ రైస్ వంటి ఆహారపదార్థాలు విక్రస్తున్నారు. అయితే వీటిలో చాలా వరకు కనీస నాణ్యతాప్రమాణాలు పాటించడంలేదు. తక్కువ ధరకు ఆహార పదార్థాలంటూ బోర్డులు వేలాడదీసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఫలితంగా నాణ్యతలేని ఆహారం తిని ప్రజలు అనారోగ్యం కొని తెచ్చుకుంటున్నారు. వరంగల్‌తో పాటు హనుమకొండ, కాజీపేట, మహబూబాబాద్, జనగామ, పరకాల, తొర్రూరు, నర్సంపేట లాంటి ప్రధాన పట్టణాల్లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు విచ్చలవిడిగా పెరిగిపోయాయి. ఈ ఫాస్ట్‌ఫుడ్ వల్ల అనేక రకాల ఇబ్బందులుంటాయని వైద్యులు చెబుతున్న పట్టించుకునే వారు లేరు.

పుట్టగొడుగుల్లా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు..

పట్టణాలతోపాటు మారుమూల ప్రాంతాల్లో కూడా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. సాయంత్రం నాలుగు గంటలైతే ప్రధాన రహదారుల్లో వందలాది దుకాణాలు దర్శనమిస్తున్నాయి. వీటిలో చాలా వరకు కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. కల్తీ రాజ్యమేలుతోంది. ఇది తెలియక తింటున్న భోజన ప్రియులు అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి రోజూ వేలాది మంది వస్తుంటారు. వేలాది మంది విద్యార్థులు నగరంలో చదువుకుంటున్నారు. పెద్ద హోటళ్లలో ధరలు భారీగా ఉన్న నేపథ్యంలో స్థానికంగా బండ్ల వ్యాపారులు విక్రయించే ఆహార పదార్థాలు తక్కువ ధరకు లభిస్తుండడంతో ఇటువైపు మొగ్గుచూపుతున్నారు. ఇందులో కొంతమంది దుకాణాదారులు రుచితో ఆకట్టుకునేందుకుగాను ఆరోగ్యానికి హానికలిగించే నిషేధిత వస్తువులతో ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారు.



కాజీపేట ప్రాంతంలో రహదారుల పక్కన తయారవుతున్న ఆహార పదార్థాలు

రంగులు వేస్తే అంతే

ఆహార పదార్థాలు సర్వం రంగులమయంగా మారుతున్నాయి. చికెన్ పకోడీలో రంగు, జిలేబీలో రంగు, నోరూరించే కారలో రంగులు.. ఇలా చెప్పుకుంటూపోతే దాదాపు తినుబండారాలన్నింటిలో రంగులు కలుపుతున్నారు. దీంతో ఆహారం సహజత్వం కోల్పోయి కలుషితమవుతోంది. వీటిని తినడం ద్వారా మనిషి వ్యాధి నిరోధక శక్తిని కోల్పోతాడు. ఇది తెలియని చాలామంది తక్కువ ధరకు లభిస్తుందని ఆకలి తీర్చుకోవడానికి ఫాస్ట్‌ఫుడ్‌ను ఇష్టంగా భుజిస్తున్నారు.



అంతా అపరిశుభ్రతే

ఫాస్ట్‌ఫుడ్ దుకాణాదారులు కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకపోగా చాలా షాపులు మురుగు కాలువలు, మురుగు నీటి ప్రవాహం పక్కనే ఏర్పాటు చేస్తుండడం ఆందోళన కలిగించే విషయం. దోమలు, ఈగలు ఆహార పదార్థాలపై వాలుతాయి. వంటకాలకు వాడిన నూనె మళ్లీ మళ్లీ వాడుతుండడంతో జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బయట ఆహారం వద్దు



రహదారుల పక్కన బయట ప్రాంతాల్లో తయారయ్యే ఆహార పదార్థాలను భుజించకపోవడమే ఉత్తమం. కల్తీ నూనె వాడకంతో పాటు మసాలాలు సరైనవి కాదని గుర్తించాలి. వీటిని తినడం వల్ల జీర్ణక్రియకు సంబంధించిన వ్యాధులు ప్రబలుతాయి. పిల్లలకు బయట ఫుడ్ ఇవ్వకపోవడమే మంచిది.

–బొల్లికొండ యాదగిరి, సోమిడి

ఫాస్ట్‌ఫుడ్ తినడం మంచిదికాదు



ఫాస్ట్‌ఫుడ్ తినడం ఆరోగ్యానికి మంచిది కాదు. ప్రధానంగా యువత ఫాస్ట్‌ఫుడ్ వైపు మక్కువ చూపుతోంది. రుచులు, రంగులకు తలొగ్గి ఫాస్ట్‌ఫుడ్‌లకు వెళ్లి లాగించేస్తోంది. దీనివల్ల వచ్చే అనార్థాలను మాత్రం గుర్తించడం లేదు. ఈ విషయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్త పరచాలి. ఫాస్ట్‌ఫుడ్ వల్ల అనేక వ్యాధులు వస్తాయని వారికి చెప్పాలి. ఈ విషయంలో సంబంధిత అధికారులు కూడా స్పందించి తనిఖీలు చేయాలి.

–డాక్టర్ మధులత, కాజీపేట

రుణమాఫీ అమలుకు పకడ్బందీ చర్యలు

- రైతులకు ఇబ్బంది లేకుండా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు
- సమ్యలు ఉంటే 18004253434, 91542 52936 నంబర్లను సంప్రదించాలి
- అధికారుల సమీక్ష సమావేశంలో వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి

కాశోజీ సెంటర్: రుణమాఫీ అమలుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, సహకార శాఖ అధికారులు, బ్యాంకర్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో మొదటి విడత 26,396 మంది రైతుల ఖాతాల్లో రూ.134.20 కోట్లు జమ అయ్యాయని తెలిపారు. లబ్ధిదారుల జాబితాను మండల పరిషత్ కార్యాలయాలు, రైతువేదికలు, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. ప్రతి బ్యాంకుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి రైతులకు ఎలాంటి ఇబందులు లేకుండా చర్యలు తీసుకుటున్నట్లు వివరించారు. రైతు రుణమాఫీకి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే 18004253434, 9154252936 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్, లీడ్ బ్యాంకు మేనేజర్ హెచ్.రాజు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ సత్యం, వరంగల్ కోపరేటివ్ బ్యాంకు సీఈఓ వజీర్ సుల్తాన్, జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి, కెనరా బ్యాంకు మేనేజర్ మాధవి, జిల్లా నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పల్లి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

మార్కెట్‌లో రైతులకు వసతులు కల్పించాలి

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు వసతులు కల్పించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి అధికారులను ఆదేశించారు. మార్కెట్‌లోని పల్లియార్డును గురువారం ఆమె సందర్శించి క్రయవిక్రయాలను పరిశీలించారు. పచ్చిపల్లికాయ, ఎండిన పల్లికాయ ధర, మార్కెట్‌లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఆమె రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, డీఎంఓ ప్రసాదరావు, మార్కెట్ కార్యదర్శి నిర్మల, గ్రేడ్–2 కార్యదర్శి రాము, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

జిల్లాలో వచ్చే రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యా శారదాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే 1800 425 3434, 9154252936 నంబర్లలో సంప్రదించాలని, వర్షాలు కురుస్తున్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బిల్లుల చెల్లింపుపై ప్రచారం చేయాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి


హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించే విధానంపై విస్తృత ప్రచారం చేయాలని ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. గురువారం రాత్రి హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సర్కిల్‌కు నియమించిన నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. యాప్‌తో పాటు ఎన్పీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా సులభంగా బిల్లులు చెల్లింపు చేయొచ్చన్నారు. యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్‌లో ప్లే స్టోర్ నుంచి వినియోగదారులు సులువుగా డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్స్‌లో భాగంగా ఫీడర్లపై అంతరాయాలను తగ్గించడానికి ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన ఏబీ స్విచ్‌లు మరమ్మతు చేయాలని సూచించారు. వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రతి అధికారి, ఉద్యోగి అంకితభావంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీజీఎంలు కె.తిరుమల్ రావు, కె.కిషన్, రాజు చౌహాన్, కె.ఎస్.గుట్ట, జి.ఎంలు గౌతమ్ రెడ్డి, నాగప్రసాద్, వేణు బాబు, దేవేందర్, మాధవరావు, అన్నపూర్ణ, డీఈ(టీ)శ్రీధరాచారి పాల్గొన్నారు.

వరంగల్‌లో 'గరీబ్‌రథ్'కు హాల్టింగ్..

- 27, 29వ తేదీల నుంచి అమలు

కాజీపేట రూరల్ : వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రయాణించే రెండు గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీస్‌లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు గురువారం తెలిపారు.జూలై 27వతేదీ నుంచి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–హజ్రత్‌నిజాముద్దీన్ (12611) ఎక్స్‌ప్రెస్‌కు, అదేవిధంగా జూలై 29వ తేదీ నుంచి హజ్రత్‌నిజాముద్దీన్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12612) ఎక్స్‌ప్రెస్‌కు అప్ అండ్ డౌన్ రూట్‌లో ఎక్స్‌పర్మెంటల్ హాల్టింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. గతంలో ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీస్‌లకు తెలంగాణలో హాల్టింగ్ లేదు. బల్లార్షాలో మాత్రమే హాల్టింగ్ ఉంది. ఇప్పుడు వరంగల్‌లో హాల్టింగ్ కల్పించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంజీఎంను సందర్శించిన ఐటీ నిపుణులు



ఎంజీఎంలో ఐటీ నిపుణులు, తహసీల్దార్ ఇక్బాల్

ఎంజీఎం: ఎంజీఎంపై వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈక్రమంలో ఆస్పత్రికి వచ్చే రోగులు ఓపీ నుంచి డిశ్చార్జ్ అయ్యే వరకు అన్ని వివరాలు ఆన్‌లైన్ చేసేందుకు ఐటీ నిపుణుల బృందం ఎంజీఎంను సందర్శించింది. ఈసందర్భంగా ప్రస్తుతం ఎంజీఎం ఆస్పత్రిలో సేవలు ఎలా కొనసాగుతున్నాయి? అడ్మిషన్ ప్రక్రియ ఎలా సాగుతోంది? వాటిని ఆన్‌లైన్‌లో పొందుపర్చేలా ఎలా ముందుకు సాగాలి అనే అంశాలను బృంద సభ్యులు పరిశీలించారు. ఐటీ నిపుణుల వెంట ఆర్ఎంఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనధికారిక లేఔట్ తొలగింపు



మొగిళిచర్లలో అనధికార లేఔట్ హద్దులు తొలగిస్తున్న బల్దియా సిబ్బంది

వరంగల్ అర్బన్: వరంగల్ 15వ డివిజన్ పరిధి మొగిలిచర్ల ప్రాంతం సర్వే నంబర్ 178/2ఇ, 179/ఇలో మూడెకరాల విస్తీర్ణంలో అనుమతుల్లేకుండా ఏర్పాటు చేసిన లేఔట్‌ను గురువారం బల్దియా టౌన్ ప్లానింగ్ సిబ్బంది డీఆర్ఎఫ్ వారి సహకారంతో తొలగించినట్లు ఏసీపీ ఖలీల్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేఔట్ పేరు మీద జీడబ్ల్యూఎంసీ, 'కుడా' నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా అనధికారికంగా హద్దు రాళ్లు ఏర్పాటు చేసి మూడెకరాల భూమిని ప్లాట్లుగా మార్చడం జరిగిందని, ఈ నిర్మాణంపై ఫిర్యాదు అందిన నేపథ్యంలో కమిషనర్ సిటీ ప్లానర్ ఆదేశాల మేరకు హద్దులు కూల్చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీబీఓ ఖాజా షరీఫ్ చైన్‌మెన్ ప్రశాంత్‌తో పాటు డీఆర్ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు గడువు పొడిగింపు

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2024లో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తుల గడువును జూలై 21 తేదీ వరకు పొడిగించినట్లు వరంగల్, హనుమకొండ కళాశాలల ప్రిన్సిపాల్స్ జుమ్లానాయక్, జి.సక్రు గురువారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. సంవత్సరం కోర్సులు కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్ సెక్రటేరియల్ అసిస్టెంట్, వెల్డర్, రెండు సంవత్సరం కోర్సులు డ్రాఫ్‌మెన్ సివిల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్స్ట్రూమెంట్ మెకానిక్, రిఫ్రిజిరేషన్, డిజైనింగ్, టెక్నీషియన్ కోర్సులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. http://iti.teanfana.gov.in సైట్‌లో తమ వ్యక్తిగత మొబైల్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇందులో 10 శాతం ఐఎంసీ ఫీజు పేమెంట్ సీట్లు ఉన్నాయని, అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు ప్రకటనలో పేర్కొన్నారు.

హామీ నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ఒక్క రోజులో రూ.లక్ష మాఫీ చారిత్రాత్మకం
- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

హన్మకొండ: రుణమాఫీపై రైతులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకున్నారని తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. రూ.లక్ష రుణ మాఫీ చేసిన సందర్భంగా గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయం వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి టెస్కాబ్, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, పాలక మండలి సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు క్షీరాభిషేకం నిర్వహించారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క రోజు రాష్ట్ర వ్యాప్తంగా రైతులందరికీ రూ.లక్ష రుణమాఫీ చేయడం చారిత్రాత్మకమన్నారు. గత ప్రభుత్వం విడతలుగా చేస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒకే సారి రుణమాఫీ చేస్తోందన్నారు. ఆగస్టు 15 లోపు రూ.2 లక్షల వరకు రుణమాఫీ జరుగుతుందన్నారు. రుణమాఫీపై విపక్షాలు లేనిపోని రాద్ధాంతం చేస్తున్నాయని, వారి మాటలు పట్టించుకోవద్దన్నారు. వరంగల్ డీసీసీబీ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 57,129 మంది రైతులకు రూ.249.61 కోట్ల రుణమాఫీ చేస్తున్నామన్నారు. రుణమాఫీతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ వజీర్ సుల్తాన్, డైరెక్టర్లు రాజేశ్వర్ రెడ్డి, హరిప్రసాద్, గోపాల్ రావు, నర్సింగరావు, రమేశ్, పీఏసీఎస్ చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

పోస్టుమార్టం చేయకుండా మృతదేహాన్ని అప్పగించండి

- మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు

గాంధీఆస్పత్రి : మానవతా దృక్పథంతో వ్యవహరించి పోస్టుమార్టం నిర్వహించకుండా మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించాలని తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జారీ చేసిన ఆదేశాలను చిలకలగూడ పోలీసులు, గాంధీ మార్చురీ వైద్యులు అమలు చేశారు. వివరాలు... వరంగల్‌కు చెందిన సాంబశివరావు, విశ్వరూపలు భార్యభర్తలు. కొన్ని రోజుల క్రితం సాంబశివరావు ఇంట్లో చెప్పకుండా నగరానికి వచ్చి గాంధీఆస్పత్రి మెట్రోస్టేషన్ ఫుట్‌పాత్‌పై నివసిస్తున్నాడు. అస్వస్థతకు గురైన సాంబశివరావు బుధవారం మృతిచెందాడు. సమాచారం అందుకున్న చిలకలగూడ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి, గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి ఫొటోలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం కల్పించారు. సమాచారం తెలుసుకున్న మృతుని భార్య విశ్వరూప గాంధీ మార్చురీకి చేరుకుని భర్త సాంబశివరావు మృతదేహంగా గుర్తించారు. భర్త మృతిపై తనకు ఎటువంటి అనుమానాలు లేవని పోస్టుమార్టం చేయకుండా మృతదేహాన్ని అప్పగించాలని కోరగా, మార్చురీ వైద్యులు తిరస్కరించారు. మృతుడి భార్య విశ్వరూప సామాజిక మాధ్యమాల ద్వారా తన గోడును వెల్లబోసుకుంది. విషయం తెలుసుకున్న వైద్య మంత్రి దామోదర రాజనర్సింహ తక్షణమే స్పందించారు. గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, చిలకలగూడ సీఐ అనుదీప్‌లకు ఫోన్ చేసి పోస్టుమార్టం నిర్వహించకుండా మృతదేహాన్ని అప్పగించాలని సూచించగా వారు మంత్రి ఆదేశాలను అమలు చేశారు. మంత్రి ఆదేశాల మేరకు పోస్టుమార్టం నిర్వహించకుండా సాంబశివరావు మృతదేహాన్ని భార్య విశ్వరూపకు అప్పగించామని చిలకలగూడ సీఐ అనుదీప్ తెలిపారు.

కులగణన తర్వాతే 'స్థానికం' నిర్వహించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

కాజీపేట అర్బన్ : బీసీ కులగణన చేపట్టి రిజర్వేషన్లు పెంచిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వల్లకొండ వేణుగోపాల్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమగ్ర కులగణన యాత్ర సభకు శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీల లెక్కలు తేల్చాలంటే ప్రభుత్వాలకు బాధ ఎందుకని ప్రశ్నించారు. బీసీలను దూరం చేసుకునే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ తగ్గిందని గుర్తు చేశారు. శాసన సభ ఎన్నికల ముందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో బీసీ కులగణన చేపడుతామన్నారని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీ కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని, లేనిపక్షంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, నాయకులు కనకాల శ్యామ్ కుర్మ, విక్రమ్‌గౌడ్, మణి మంజరి, కుందారపు గణేశ్‌చారి, బాలరాజ్‌గౌడ్, సగర శేఖర్, ఎలకట్టి విజయ్‌కుమార్, బొనగాని యాదగిరిగౌడ్, బత్తుల రాజన్‌బాబు, జనగాని శ్రీనివాస్, దాడి మల్లయ్యయాదవ్, బచ్చు ఆనందం, డాక్టర్ చిర్రరాజుగౌడ్, తాళ్లపల్లి సురేశ్, కానగోని అశోక్‌గౌడ్, అరేగంటి నాగరాజు, యాకయ్య,శోభారాణి,పద్మజ, పంజాల మధు, మారగోని రవి,ఆదర్శ్ గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

టీజీ డీఎస్సీ ప్రారంభం

తొలిరోజు 1,161మంది అభ్యర్థుల హాజరు
- రెండు సెషన్లలో పరీక్ష
- పర్యవేక్షించిన అధికారులు
- బందోబస్తు నిర్వహించిన పోలీసులు

విద్యారణ్యపురి: రాష్ట్రంలో టీచర్ల నియామకానికి నిర్వహించే టీజీడీఎస్సీ గురువారం నుంచి ప్రారంభమైంది. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో ఐదు పరీక్ష కేంద్రాల్లో మొదటి సెషన్ అన్నింటిలో పరీక్ష నిర్వహించగా.. మధ్యాహ్నం మాత్రం ఒకే కేంద్రంలో జరిగింది. ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్(సీబీటీ) టెస్ట్ నిర్వహిస్తున్నారు. ఇందుకు హనుమకొండలోని జయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, కిషన్‌పురలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ, హసన్‌పర్తిలోని నోబుల్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్, హసన్‌పర్తి ఎర్రగట్టుగుట్ట వద్ద ఉన్న అయాన్ డిజిటల్ జోన్, హసన్‌పర్తి భీమారం సమీపంలోని మోక్షిత కంప్యూటర్స్ కేంద్రాల్లో గురువారం పరీక్ష జరిగింది. గురువారం ఉదయం మొదటి సెషన్‌లో ఆయా కేంద్రాల్లో కలిపి 1,206మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 1,038మంది హాజరయ్యారు. 158మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 138మంది అభ్యర్థులకు 123మంది హాజరయ్యారు. 15మంది గైర్హాజరయ్యారు. అబ్జర్వర్లు పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. నిర్దేశించిన పరీక్షసమయం ఉదయం 9గంటలుకాగా 15 నిమిషాలు ముందుగానే ఉదయం 8.45గంటలకే పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేశారు. మధ్యాహ్నం 1.45 గంటలకే పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేశారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాల్లోనికి వెళ్లాక బయోమెట్రిక్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించారు. ఫొటో ఐడీకార్డును పరిశీలించారు. మరో 12రోజులపాటు ప్రతిరోజు రెండు సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



కిషన్‌పురలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో డీఎస్సీ పరీక్ష రాసి వస్తున్న అభ్యర్థులు

కొడుకు పుడితే.. మృత ఆడశిశువును ఇచ్చారు..?

- హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో కుటుంబ సభ్యుల ఆందోళన

హన్మకొండ చౌరస్తా: కొడుకు పుడితే మృతిచెందిన ఆడశిశువును అప్పగించారంటూ గురువారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో బాలింత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. బాలింత భర్త కలకొల్లు సాంబరాజు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. జనగామ జిల్లా చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన కలకొల్లు సాంబరాజు భార్య అనూషకు పురిటి నొప్పులు వస్తుండడంతో ఈ నెల 17న హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు ప్రసవానికి సమయం ఉందని అడ్మిట్ చేసుకున్నారు. గురువారం ఉదయం మరోసారి వైద్య పరీక్షలు చేసిన వైద్యులు గర్భంలో శిశువు కదలికలు లేవని, ఆపరేషన్ చేయాలని సూచించారు. ఆపరేషన్ తర్వాత మృత ఆడశిశువును తీసుకొచ్చి అప్పగించారని, శిశువుకు ఎలాంటి ట్యాగ్ వేయలేదని, తమకు కొడుకు పుడితే మార్చి వేరొక మృత ఆడ శిశువును అప్పగించారని అనూష భర్త సాంబరాజు తెలిపారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే మాకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మాకు పెళ్లయిన ఏడు సంవత్సరాలకు బాబు పుడితే సంతోషం లేకుండా చేశారని రోదిస్తూ తెలిపారు. ఈ ఘటనపై జీఎంహెచ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మిని వివరణ కోరగా తల్లిగర్భంలోనే శిశువు చనిపోయిందని, ఆ విషయాన్ని ముందే కుటుంబ సభ్యులకు తెలియజేసి వారి సంతకాలను కూడా తీసుకున్నామని తెలిపారు. మగ శిశువుకు బదులు ఆడ శిశువు అని ఎందుకు చెబుతామని, ఏదైనా ఉంటే పోలీసు కేసు పెట్టుకోవచ్చని, విచారణలో నిజం తెలుస్తుందని వివరణ ఇచ్చారు.



జీఎంహెచ్ ఎదుట ఆందోళన చేస్తున్న బాలింత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు